# ఇంటర్వ్యూ

మహర్షి

ఈ గోవిందం గాడు పిచ్చికుక్కలా మరీ రెచ్చిపోతున్నాడేమిటి? మన ఛీఫ్ రిపోర్టర్‌ని నువ్వెంత, నీ వ్యవహారం ఏమిటి అని గుంజీలు తీయించాడట. పాపం అయిన మన ఎడిటర్ దగ్గరకెళ్ళి బావురు బావురుమని, గోల గోలగా చెప్పుకుంటుంటే విన్న నాకు అయ్యో పాపం అనిపించింది" సబ్ ఎడిటర్ వాపోయాడు.

"ఎంతయినా హోం మినిష్టర్ కేండిట్ కదా... అదీ కాకుండా స్పెషల్ రిపోర్ట్. మన ఎడిటర్ కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈసారి ప్రభుత్వం దిగి పోవడం ఖాయం. ఆ వెంటనే వీడిని పీకి పారేయడం తప్పదు" అన్నాడు సబ్ ఎడిటర్.

అంతలో గోవిందం ప్రవేశించాడు. "వాసన, చాడీల వాసన. ఎవరిది? ఎవరు నా గురించి చొల్లు కబుర్లు చెప్పుకుంటున్నారు. నేనసలే కుక్కలా వాసన పసికట్టి పట్టేయగలను. నా గురించి వెర్రి కబుర్లు చెప్పుకునే వాళ్లంటే నాకు పరమ మంట" అంటూ లోపలికొస్తూ స్టూలును చూడకుండా తన్నేసి దభీమని కిందపడి, బాధతో కెవ్వున అరిచాడు. అంతలో అటెండరు వచ్చి లేపబోయాడు. ఏకాలో చెయ్యో విరిగితే బాగుంటుందని అనుకున్నారంతా.

"ఆగు. నువ్వెందుకులేపుతావు. నేనేం పడలేదు. ఊరకనే ఉత్తుత్తిగా పడ్డానంతే... మీరంతా మరీ సీరియస్‌గా పని చేసుకుంటున్నారని, రిలీఫ్‌గా కొంచెం సేపు అలా నవ్వించాలని పడ్డానన్నమట. ఒకసారి అందరూ నవ్వండి" అన్నాడు గోవింద. అందరూ నవ్వారు. టైపిస్ట్ పంకజం పైట చెంగు అడ్డం పెట్టుకుని కిసుక్కు కిసుక్కున నవ్వింది.

"అది. అలా నవ్వాలన్న మాట" అని లేచి నిలబడి అడుగేసి కాలుకాలుక్కుమనగా "నాకేం దెబ్బలు తగలలేదన్న మాట. కాలు నొప్పి పుట్టలేదన్న మాట. కావాలని ఉత్తుత్తిగా అలా కుంటుతూ నడిచి వెళతానన్నమాట. మీరంతా హాయిగా నవ్వుకుని, ఎంచక్కా పని చేసుకుంటారన్న మాట" అని గోవిందం కుంటుతూ వెళ్ళిపోయాడు.

"వీడెక్కడా శనిరా భగవంతుడా... ఈ ప్రభుత్వం ఎప్పుడు పడిపోతుందో,,, వీడినెప్పుడు పీకేస్తారో కానీ నేనా టెన్షన్ భరించలేక పోతున్నాను. క్రిందపడి కాలో చెయ్యో విరిగినా నాలుగు రోజులు హాస్పటల్‌లో పడి వుంటే కాస్త రిలీఫ్ దొరికేది. ఈ జన్మకు అంత అదృష్టం కూడానా?" అన్నాడు సబ్ ఎడిటర్ జుట్టులో వేళ్ళు దూర్చి బరబరమని గోక్కుంటూ.

"నీ బుర్ర బరుకుడు ఆపు. వీడు ఎడిటర్ దగ్గరకెళ్ళాడు. పాపం ఆయన్ని ఎలా వేపుకుని నంజుకు తింటున్నాడో" అన్నాడు ప్రక్కతను.

★ ★ ★ ★ ★

"ఈ రోజు విజృంభిస్తాను. గుండాల్ని బయట కీడ్చుకొచ్చి వీధికెక్కిస్తాను. గుండు గొరిగేస్తాను. గీకి పారేస్తాను. నూరి పారేస్తాను. దుమ్ము దులిపి నా తడాఖా పస రుచి చూపిస్తాను. రేపటి నుండి మన పత్రిక సర్క్యులేషన్ అమోఘంగా పెరిగిపోతుంది. మనదే నెంబర్ వన్ పత్రిక అవుతుంది. నాదసలే వేద వాక్కు. నేనసలే హోం మినిష్టర్ కాండెట్‌ని. నా సత్తా నిరూపిస్తాను" గోవిందం ఎడిటర్ ముందు హంగామా, హడావిడి చేసి పారేస్తున్నాడు.

నిన్ను పీకేస్తే మా పత్రిక సర్క్యులేషన్ అద్భుతంగా పెరిగిపోతుంది. నీ చెత్త సమాచారం వేస్తుంటే రోజు రోజుకు పత్రిక దిగజారిపోతున్నది. ప్రభుత్వం పడిపోయిన మరుక్షణం నీ బ్రతుకు ఏం జరుగుతుందో అని నా బాధ... అనుకుంటూ అంతసేపు కళ్ళప్పగించి, నోరు తెరచి చూస్తున్న ఎడిటర్ నోటి లోనికి ఈగ దూరి గోల చేయడంతో "ధూ... ధూ..." అన్నాడు.

"ఆ... నన్ను ధూ... అని ఉమ్ముతావా? నేనంటే ఏమనుకున్నావ్... నా పవరేంటో చూపిస్తాను. హోం మినిష్టర్‌తో చెప్పి నిన్నేం చేయిస్తానో చూడు. తిప్పు... హోమ్ మినిష్టర్ నెంబర్ తిప్పు" రుసరుసలాడాడు గోవిందం.

"అయ్యో గోవిందం. నేను మిమ్మల్ని ధూ అనలేదు. మీ మాటలు వింటూ తన్మయంలో నోరు మూయడం మరిచాను. సమయం చూచుకుని ఓ ఈగ గారు నోట్లో దూరి గురగుర గోల చేస్తే అలా ఉమ్మానన్న మాట. తమరు శాంతించి నా మాట విని అలా కూర్చోండి" బ్రతిమిలాడాడు ఎడిటర్.

"సరి సరి. ఈ రోజు మంచోళ్ళ మొహం చూసి వుంటారు. అందుకే బ్రతికి పోయారు" అంటూ కూర్చున్నాడు గోవిందం.

ఇంకెవరి మొహం చూస్తాను. లేవగానే అద్దంలో నా దరిద్రపు గొట్టు మొహమే చూచుకుని వుంటాను అని మనసులోనే తిట్టుకుని, పళ్ళు కనిపించేలా నవ్వు మొహాన పులుముకుని "తమరు ఏమి అనుకోకపోతే ఇవాళ ప్రతిపక్ష పార్టీ అద్యక్షుడు దుర్వాసరావు గారి ఇంటర్వ్యూ ఉంది. దానికి మీరు వెళ్ళి ఇంటర్వ్యూ చేసి రావాలి" అన్నాడు.

"ఆ మాత్రం దానికి వెళ్ళడం ఎందుకు? నేనే రాసి పారేస్తాను" అన్నాడు గబుక్కున తెల్ల కాగితం లాక్కుని రాయబోతూ.

"అయ్యో గోవిందం... మీరు అంతటి సమర్థులే. కానీ ఆయనను ఇంటర్వ్యూ చేసినట్లు రాయడానికి ఆయనేం సినిమా యాక్టరు కాదు. ప్రతి పక్ష నాయకుడు. ఈ విషయం ఆయనకు తెలిసిందంటే ఆయన తిట్లకు మన పత్రిక కొట్టుకుపోతుంది. మన స్టాఫ్ మొత్తం వీధిన

పడుతుంది" గడ్డం పట్టుకుని బ్రతిమాలాడు ఎడిట్.

"ఓ.కే. మరీ అంత హీనంగా బ్రతిమాలకు. ఎంతయినా ఎడిటర్‌వి కదా... ఈ రోజు దుర్వాసరావు దుమ్ము దులిపేస్తాను, ఆయన్ని కడిగేస్తాను" అంటూ బయటకెళుతుండగా లోపలకొచ్చాడు సబ్ ఎడిటర్. "ఎవరినండి దుమ్ము దులిపేస్తాను, కడిగి పారేస్తాను అంటున్నాడు" అన్నాడు.

"పిచ్చి కుక్క ముండా కొడుకు. ఏం మాట్లాడతాడో వాడికే తెలియదు. వీడసలు బయటకెళితే నోరు పెగిలి చావదని చాలమంది చెప్పారు. ఇవాళ కీ యిచ్చి పంపాను. ఆ దుర్వాసరావు చేతిలో చావు దెబ్బలు తిని వచ్చినా వస్తాడు" అన్నాడు ఎడిటర్.

★ ★ ★ ★ ★

"నమస్కారం దుర్వాసరావు గారూ. నేను ఫలానా పత్రిక నుండి ఇంటర్వ్యూ చేయటానికి వచ్చాను."

"సరే అడుగు" అన్నాడు దుర్వాసరావు విసుగ్గా.

"మీ పార్టీ సిద్ధాంతాలేమిటో కాస్త వివరిస్తారా?" అడిగాడు గోవిందం రాసుకోబోతూ.

"అవన్నీ మాకు తెలియదు. వాటిని హైకమెండ్ చూసుకుంటోంది" అన్నాడు దుర్వాసరావు.

"మరి ప్రతి పక్ష నాయకుడిగా ఏం చేస్తుంటారు?"

"నా గురించి పూర్తిగా తెలిసినట్లు లేదులా వుంది. వారానికి ఓసారి బంద్. రెండు వారాలకొకసారి రాస్తారోకో నెలకోకసారి హర్తాళ్. ఆపై నిరసన సభలు, ఆటు తరువాత ఊరేగింపులు, బహిరంగసభలు" చెప్పాడు దుర్వాసరావు.

"ఇవన్నీ ఎందుకు చేస్తుంటారు?"

"ఇది మరీ పిచ్చి ప్రశ్న. ప్రతి పక్షంలో కూర్చుని పనేమి లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోమంటావా? అందుకే ఇవన్నీ చేస్తున్నానన్న మాట."

"మరిలా ప్రజల్ని ఇబ్బందులు పెడుతుంటే వాళ్ళకి అసౌకర్యం కలగదా?"

"తప్పకుండా కలుగుతుంది. అయినా ఏం చేస్తారు? ప్రజలు సహన జీవులు.'


"ఈసారి మీ పార్టీ అధికారంలో కొస్తుందంటారా?" గోవిందం ఇకిలించి మరీ అడిగాడు.

"మీరు మరీ చొప్పదంటూ ప్రశ్నలేస్తున్నారు. మా పార్టీ వచ్చి తీరుతుంది" దుర్వాసరావు కంఠం కరకుగా వుంది.

"మరీ అంత గట్టిగా ఎలా చెబుతున్నారు?"

"నోటితో చెబుతున్నాను. ఏమిటా పిచ్చి పుల్లాయ్ ప్రశ్న. మా పార్టీ తరపున వివిధ రాష్ట్రాలలో లక్షలాది కార్యకర్తలకు రిగ్గింగ్ కోసం ట్రైనింగ్ ఇప్పిస్తున్నాం. అప్పటికీ వీలు కాకపోతే తరువాత ఆలోచిస్తాం" అన్నాడు దుర్వాసరావు.

"ఆ మధ్య ప్రభుత్వం వేటి మీదో రేట్లు పెంచిందని, మీకు గుర్తు కొచ్చినప్పుడల్లా బంద్‌కు పిలుపునిచ్చి, అనేక బస్సుల్ని కాల్చి బూడిద చేశారు. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడి, చాలా బాధలు పడ్డారూ. రేపు మీ అదృష్టం బాగుండి, రిగ్గింగ్ సరిగ్గా జరిగి మీ పార్టీ అధికారంలో కొస్తే మీరు రేట్లు పెంచకుండా వుంటారా? ఎలా అడిగానో చూడండి. దీనికి మీరు సమాధానం చెప్పలేరు కదా" అడిగాడు గోవిందం ఆనందంగా.




"తప్పకుండా చెబుతాను. ఉన్న డబ్బంతా ఇప్పుడు మంత్రులు దొచ్చుకుపోతే మాకేం మిగులుతుంది. అందుకే రేట్లు తప్పకుండా పెంచి తీరుతాం."

"అలాంటప్పుడు ప్రజలలో మీకు సింపతి వుండదు కదా..."

"అయిదు సంవత్సరాల వరకు అధికారం మా చేతిలో వుంటుంది కదా... వాళ్ళ బోడి సింపతి ఎవడిక్కావాలి" నవ్వి మరీ చెప్పాడు దుర్వాసరావు.

"రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసరాల రేట్లు, తరుగుతున్న సామాన్యుడి ఆర్థిక పరిస్థితిపై మీ అభిప్రాయం ఏమిటి?"

"సామాన్య మానవుడు అసలు ఎదగకూడదు. వాడు ఎదిగితే మాకు రాజకీయ జీవితం ఉండదు. అందుకే వాడిని ఆర్థికంగా చితకకొట్టి, ఆపై సింపతి చూపుతామన్న మాట."

"బాగుంది బాగుంది. ప్రస్తుతం మీ పార్టీ లక్ష్యమేమిటి?" కళ్ళ జోడు సరి చేసుకుని మరీ అడిగాడు గోవిందం.

"ఈ సంవత్సరంలో వంద బంద్‌లు జరిపి గిన్నిస్ బుక్‌లోనికి ఎక్కాలని వుంది."

"ఏ కారణం లేకుండా బంద్‌లెలా చేస్తారు? ఏలా అడిగానంటారు?"

"నీ బొందలా అడిగావ్. బంద్ జరగాలంటే కారణం అవసరం లేదు. రోడ్ను ప్రక్కన నిద్రబోయే ఏ ముష్టివాడినో కారు ఎక్కించి మరీ చంపిస్తాం. అది ఎవరు చంపారో అధికారం పార్టీ పట్టించుకోవడం లేదని, దాని వెనుక అధికార పార్టీ హస్తం వుందని ఓ నాలుగు బంద్‌లు జరిపిస్తామన్న మాట."

"బంద్‌లు జరిపించి మీరేం సాధిస్తారు?"

"ఈ ప్రశ్ననీ బొందలా వుంది. రేపు ఎన్నికల నియమావళిలో బంద్‌ని రద్దు చేస్తామని ప్రచారం చేస్తాం. జనం అప్పుడు చచ్చినట్లు ఓట్లు వేస్తారు."

"ఆఖరి ప్రశ్న. రేపు రిగ్గింగ్ జరిపించి, ఎన్నికలలో మీ పార్టీ గెలిచి మిమ్మల్ని వెన్నపోటు పొడిచి మరొకరు ముఖ్యమంత్రి అయితే మీరేం చేస్తారు?"

"రాష్ట్రాన్ని వల్ల కాడు చేస్తాను. అదే జరిగితే ముందుగా నిన్ను మర్డర్ చేస్తాను. అయినా ఇది.. ఇంటర్వ్యూరా వెధవ సన్నాసి. నువ్వు పత్రికకు కొత్తో లేక నేను పార్టీకి కొత్తా? అడుగుతున్నావు కదా అని చెప్పాను. ఇదంతా నువ్వు గులకొద్ది గీకి పారేస్తే, రేపు సెంట్రల్ నన్ను చెడుగుడు ఆడతారు" అంటూ దుర్వాసరావు కాగితాలు లాక్కుని చింపి ముక్కలు చేసి, పెన్ను తీసుకుని అవతల పడేసి, గోవిందాన్ని పైకి లేపి గిర గిరా త్రిప్పి రోడ్డ మీదకు విసిరాడు.

ఆ సంగతి విన్న పత్రికా ఎడిటర్, స్టాఫంతా ఆనందం పట్టలేక తబ్బి వుబ్బయిపోతూ స్వీట్లు పంచుకుని నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు.

✶

*(పాఠకులూ... మీరు కూడా ఇంటర్వ్యూ చేయాలన్నా, ఇంటర్వ్యూ ఇవ్వాలన్నా నాకు వెంటనే లెటర్ రాసి అప్పాయింట్‌మెంట్ తీసుకోవడం మరవకండి మరి... మహర్షి, 38 నాగార్జున హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్-482)*

●